క్లుప్తంగా

కార్పొరేషన్ కమిషనర్‌కు సన్మానం

పాల్వంచ: పాల్వంచ మున్సిపల్ కమిషనర్ కె.సుజాత కొత్తగా ఏర్పడిన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియామకం కావడం పట్ల పలువురు ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో ఆమెను పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. మున్సిపల్ మేనేజర్ సత్యనారాయణ, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ అందజేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి మాజీ ఉద్యోగులందరూ ప్రతీ ఏటా నవంబర్‌లో లైఫ్ సర్టిఫికెట్ (జీవన్ ప్రమాణ్) సీఎంపీఎఫ్ కార్యాలయంలో అందజేయాలని జీఎం పర్సనల్ జీవీ కిరణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం సింగరేణి కార్యాలయంలో మాట్లాడుతూ.. సింగరేణి మాజీ ఉద్యోగులు జీవన్ ప్రమాణ్ అందజేయక పోవడం వలన పెన్షన్ నిలిచిపోయిందన్నారు. వివరాలకు కొత్తగూడెం 9490345763, రామగుండం 9866054594 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మైక్రోఫైనాన్స్‌పై అవగాహన

చుంచుపల్లి: మైక్రోఫైనాన్స్ సంస్థల నెట్‌వర్క్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యానగర్ కాలనీలో మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్వాహకులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆర్బీఐ నియంత్రిత ఆర్థిక సంస్థల ద్వారా అందించే సేవలపై సమాచారం అందించడం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. రాష్ట్రానికి చెందిన ఆర్థిక సంస్థలు, అనుమతి లేని వ్యక్తిగత అప్పులదారుల మధ్య తేడాలు, అధికారిక ఆర్థిక సంస్థల వద్ద అప్పులు తీసుకుంటే లాభాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమలేశ్, రామ్‌రెడ్డి, జానేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కమిటీ నియామకం



నియామక పత్రాలు అందజేస్తున్న విద్యాసాగర్

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం పట్టణ నూతన కమిటీని 46 మందితో పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్, నియోజకవర్గ కన్వీనర్ తిమ్మిరి నరేంద్రబాబుతో శుక్రవారం నియమించారు. మాడ కృష్ణారెడ్డి, గుంపుల మహేష్ జనరల్ సెక్రెటరీలుగా, పట్టణ ఉపాధ్యక్షులుగా భానోత్ రాంబాబు నాయక్, తోట సురేష్, పాసి రవి కిషోర్, కారగోని కేతన్ గౌడ్‌లతో పాటు ఇతర కమిటీలకు సభ్యులను నియమించారు.

విద్యార్థులను తీర్చిదిద్దాలి

పాల్వంచ: పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు క్రమశిక్షణ, విద్యాబుద్ధులు నేర్పించి బంగారు భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని డీఎస్పీ ఆర్.సతీష్ కుమార్ అన్నారు. స్థానిక కేటీపీఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించిన హిందీ ఉపాధ్యాయుల వృత్యంతర ఉపాధ్యాయుల ముగింపు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ పాల్గొని మాట్లాడారు. అనంతరం డీఎస్పీ, కోర్స్ ఇన్‌చార్జ్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావును సన్మానించారు.

ఉద్యోగ విరమణ సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో సివిల్ జనరల్ మేనేజర్ తిరుకోటి సూర్యనారాయణ శనివారం ఉద్యోగ విరమణ పొందుతున్న నేపథ్యంలో శుక్రవారం ఏరియా జీఎం కార్యాలయంలో జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కోటిరెడ్డి, ఇంజనీర్ కే.సూర్యనారాయణరాజు, ఏజీఎం సివిల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భారత సైన్యం త్యాగాలు వెలకట్టలేనివి

కొత్తగూడెంఅర్బన్: భారతదేశ రక్షణ కోసం పాకిస్తాన్ దాడులను తిప్పికొట్టి వీరమరణం పొందిన సైనికుల త్యాగాలను గుర్తు చేసుకుంటూ దిశ ఉమెన్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఫౌండర్ వాసర్ల నాగమణి ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఫౌండేషన్ గౌరవ సలహాదారు బొమ్మెర శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ కనుకుంట్ల నిర్మల, జనరల్ సెక్రటరీ మాధవీలత, న్యాయవాది దీప్తి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారులపై చర్యలు తీసుకోవాలి

ఇల్లెందురూరల్: మద్యం సిండికేటుపై స్పందించని ఎక్సైజ్ అధికారులపై చర్య తీసుకోవాలని, మద్యం దందాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ చేత విచారణ నిర్వహించాలని సేవాలాల్ సేన మండల శాఖ అధ్యక్షుడు వాంకుడోత్ రమేష్ డిమాండ్ చేశారు. పోలారం గ్రామంలో శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. మద్యం సిండికేటుతోపాటు అధికారుల పనితీరుపైనా విచారణ చేపట్టాలని కోరారు. సమావేశంలో తేజావత్ సురేష్, భూక్యా భాస్కర్, వాంకుడోత్ లాలు, సాయి, కృష్ణ, మోహన్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సంబురాల వేళ.. సెలవు లేదా?

తెలంగాణ రాష్ట్ర సాధనకు అందరితో పాటు సింగరేణి కార్మికులు ఉద్యమించారు. 52 రోజుల వేతనం నష్టపోయి సకల జనుల సమ్మెలో పాల్గొన్నారు. ఆపై ఆనాటి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించింది. కానీ ఏళ్లు గడుస్తున్నా సింగరేణి కార్మికులకు రాష్ట్రావతరణ దినోత్సవం రోజున వేతనంతో కూడిన సెలవు మాత్రం ప్రకటించడం లేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించాలని కార్మికులు కోరుతున్నారు.

- రాష్ట్రావతరణ దినోత్సవం రోజున విధుల్లోనే సింగరేణి కార్మికులు
- ఉద్యమంలో కీలకంగా వ్యవహరించినా దక్కని ఫలితం
- ఈ ప్రభుత్వమైనా స్పందించాలని వినతి



భూగర్భగనిలో పనిచేస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): దశాబ్దాల పోరాటాలు, అనేక ప్రాణత్యాగాలు, నీళ్లు నిధులు, నియమకాల కోసం చేసిన పోరాట ఫలితంగా సిద్ధించిన రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి పాత్ర ఎంతో కీలకం, సంస్థ ఉత్పత్తి చేసే బొగ్గులో 80 శాతం విద్యుత్ అవసరాలకు మిగతా 20 శాతం ఇతరత్రా విద్యుతేతర పరిశ్రమలకు రవాణా చేస్తుంది.

అలాగే, ప్రభావిత గ్రామాల అభివృద్ధికి రూ.60కోట్ల సోషల్ రెస్పాన్స్‌బులిటీ రివార్డ్ (సీఎస్సార్) నిధులు రూ.2,500 కోట్ల డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ ట్రస్ట్ (డీఎంఎఫ్‌టీ) సంస్థ నిధులతో గ్రామాభివృద్ధి, పట్టణాల్లో రోడ్లు, మంచినీరు, వైద్యం సేవలు, పాఠశాలల భవనాలు, కమ్యూనిటీ హాల్స్, హరితహారం వంటి అనేక సౌకర్యాలు సమకూరుతున్నాయి. అటు ఉద్యమంలోనే కాక, ఇటు స్వరాష్ట్ర అభివృద్ధిలో పాలు పంచుకుంటున్న తమకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం రోజున సెలవు ప్రకటించాలని కార్మికుల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయి.

బీఆర్‌ఎస్ ఏమీ చేయలేదు...



అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్, సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్‌తో కార్మికులకు ఒరిగిందేమీ లేదు. పైగా కార్మికులకు ఆవిర్భావ దినం రోజు సెలవుదినం ఇప్పించకపోవటం గర్హనీయం. కనీసం ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అయినా సెలవు దినం ఇప్పిస్తే మంచింది. అదేవిధంగా కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు ప్రకటించాలి.

– రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి

అమరవీరుల స్తూపం నిర్మించాలి..



పోలీసు శాఖలో పనిచేస్తూ విధి నిర్వహణలో అమరులైన వీరులకు ప్రభుత్వం స్తూపాలు ఏర్పాటు చేస్తుంది. పక్కతికి విరుద్ధంగా వందల అడుగుల లోతుల్లో పనిచేస్తూ రాష్ట్ర, దేశాభివృద్ధికి బండ కింద అమరులైన కార్మికులకు సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట అమరవీరుల స్తూపం ఏర్పాటు చేయాలి.

– అంతోటి నాగేశ్వరరావు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ

అవార్డులు అందజేయాలి..



సింగరేణి సంస్థలోని ఒక గనిలో బొగ్గుపెళ్ల బయటికి రావాలంటే 56 శాఖలు పనిచేయాల్సి ఉంది. కానీ సింగరేణి యాజమాన్యం 5,6 శాఖల విధులను గుర్తించి ప్రతిఏటా వారికే అవార్డులు ప్రకటిస్తుంది. కానీ మిగతాశాఖలు కూడ వీరితోపాటు వారి కష్టాన్ని గమనంలోకి తీసుకొని అన్ని శాఖలకు అవార్డులు ప్రకటించాల్సిఉంది.

– రజాక్, ఐఎన్‌టీయూసీ, ఏరియా ఉపాధ్యక్షుడు

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం..



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

చుంచుపల్లి: అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుకుందామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండలం విద్యానగర్, వెంకటేశ్వర కాలనీ, రామాంజనేయ కాలనీ, ఎన్‌కే నగర్, నంద తండా గ్రామపంచాయతీల పరిధిలో రూ.3.58 కోట్ల ఈజీఎస్, సబ్‌ప్లాన్ నిధులతో చేపట్టనున్న రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన, పూర్తయిన పనులకు ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల ప్రజావసరాలను గుర్తించి నిధుల మంజూరుకు కృషి జరుగుతోందని ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తిచేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుభాషిణి, తహసీల్దార్ కృష్ణ, పలుశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కొత్తగూడెం కార్యాలయంలో సొసైటీ చైర్మన్ మండె వీరహనుమంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నర్సింహారావు, ఏఈఓలు రాకెష్, రాజేశ్వరి, నర్మద, జగన్నాథరావు, వెంకటేశ్వరరావు, మమత, సాబీర్ పాషా, భూక్యా రాంబాబు, వాసిరెడ్డి మురళి, రైతులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు అమ్మొద్దు

ఇల్లెందు: వ్యాపారులు కల్తీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని డీఎస్పీ ఎస్.చంద్రభాను అన్నారు. శుక్రవారం ఇల్లెందులో వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి పలు ఎరువుల, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ అనుమతి లేకుండా ఏ విత్తనాలూ అమ్మొద్దన్నారు.

సమస్యలు పరిష్కరించండి..

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే–5 గనిలో సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు మేనేజర్ శ్యాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.

యూనిఫాం పంపిణీ

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్‌లో ఆస్పత్రి ఏరియా సివిక్ కాంట్రాక్ట్ కార్మికులకు ఏఐటీయూసీ నాయకులు శుక్రవారం యూనిఫామ్ పంపిణీ చేశారు.

డబ్ల్యూజేఐ అధ్యక్షుడిగా లక్ష్మణ్

కొత్తగూడెంఅర్బన్: వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా జిల్లా అడహక్ అధ్యక్షుడిగా ఏ.లక్ష్మణ్, ఎలక్ట్రానిక్ మీడియా బాధ్యుడిగా రాజ్ న్యూస్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ కొట్టి నవీన్‌ను నియమించినట్లు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి నారా సుబ్రమణ్యంరావు తెలిపారు. శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో ఆయన మాట్లాడారు.

రైతులకు పరిహారం ఇప్పించండి..



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: జేకే ఓసీ విస్తరణ ప్రాంతంలో సాగులో ఉన్న రైతులకు పరిహారం చెల్లించేలా సహకరించాలని 21పిట్ అఖిలపక్ష కమిటీ శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. పూసపల్లి గ్రామ సమీపంలోని సర్వే నంబర్ 588/2, 549 పరిధిలో దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న రైతులకు అన్యాయం చేయొద్దని కోరారు. గతంలో పట్టాదారు పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకుంటే అటవీ, రెవెన్యూ అధికారులు భూమి ఎవరిదనే విషయంలో స్పష్టత లేక రైతులకు పట్టాలు మంజూరు చేయలేదని గుర్తుచేశారు. జేకే ఓసీ నిర్వాసితులకు పట్టా ఉన్నా లేకున్నా, రెవెన్యూ, అటవీ భూమి ఏదైనా పరిహారం చెల్లిస్తామని గతంలో ఆర్‌ఓఎఫ్‌ఆర్ గ్రామసభలో ఆర్డీఓ శిరీష వెల్లడించారని చెప్పారు. అధికారులు గతంలో ఇచ్చిన హామీలను మాత్రమే తాము అమలు చేయమంటున్నామని విజ్ఞప్తి చేశారు. సాగులో ఉన్న భూమిని స్వయంగా పరిశీలించి అర్హులైన రైతులకు న్యాయం చేస్తామని తహసీల్దార్ రవికుమార్ హామీ ఇచ్చారు.

పర్యావరణాన్ని కాపాడాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: వర్షాకాలంలో వర్షాలు కురవాలన్నా, పర్యావరణం కాలుష్య రహితంగా ఉండాలన్నా చెట్లను పెంచడం ఎంతో ముఖ్యమని ఉద్యాన శాస్త్రవేత్త బి.శివ అన్నారు. జగన్నాథపురం గ్రామంలోని రైతు వేదికలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు, అన్నదాతల అవగాహన కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అవగాహన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం శాస్త్రవేత్త మాట్లాడుతూ.. సరైన వర్షపాతం నమోదైనా.. పంటలకు అవసరమైనప్పుడు కురవకపోవడం వలన రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. వర్షం నీరు వృథా కాకుండా రైతులు తమ పంటపొలాల్లో నీటి కుంటలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాలానికి అనుగుణంగా రైతులు పంట మార్పిడి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, ఏఓ శంభోశంకర్, విస్తరణ అధికారి సత్యనారాయణతో పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలు సాధిద్దాం..



నివాళులర్పిస్తున్న నాయకులు

జూలూరుపాడు: కాచనపల్లి అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ పిలుపునిచ్చారు. పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పాపకొల్లులో ఇల్లందు నియోజకవర్గం గుండాల మండలం కాచనపల్లి అమరవీరుల 34వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులను స్మరించుకుంటూ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా పాపకొల్లుకు చెందిన తొగరు చంద్రకళ, మంద్రాజుల కృష్ణయ్యలకు నివాళులర్పించారు. మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరారు. కార్యక్రమంలో ఏదులాపురం గోపాల్‌రావు, బానోత్ ధర్మా, తోటకూరి నరేష్, లింగాల వీరభద్రం, బానోత్ ధన్వంతరావు, వెంకటేశ్వర్లు, రాయల సిద్దు, పారుపల్లి బాబూరావు, కృష్ణ, బాలకోటి, లక్ష్మణ్, బాలు, పద్మ, తాటి నరసింహారావు, తెల్లం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ కార్యాలయంగా పాల్వంచ

- కొత్తగూడెం కార్పొరేషన్‌లో మున్సిపాలిటీ విలీనంతో మార్పు
- డిప్యూటీ కమిషనర్, ఇతర ఉద్యోగులతో కార్యకలాపాలు



డివిజన్ ఆఫీస్‌గా మారనున్న పాల్వంచ మున్సిపల్ కార్యాలయం

పాల్వంచ: కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో పాల్వంచ మున్సిపాలిటీ ఆఫీస్ డివిజన్ కార్యాలయంగా రూపాంతరం చెందింది. పాల్వంచ మున్సిపాలిటీతో పాటు కోమటిపల్లి, లక్ష్మీదేవిపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, నాయకులగూడెం, సుజాతనగర్, నర్సింహాసాగర్ గ్రామపంచాయతీలను కలుపుతూ కొత్తగూడెం కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈమేరకు పాల్వంచ కమిషనర్, కొత్తగూడెం ఇన్‌చార్జ్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న కె.సుజాత కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమయ్యారు. అలాగే, ప్రత్యేక అధికారిగా ఇల్లెందు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్‌ను నియమించారు. కాగా, కార్పొరేషన్‌ను 60 వార్డులుగా విభజించారు.

పాల్వంచలో డిప్యూటీ కమిషనర్

సుమారు లక్ష జనాభాతో కూడిన పాల్వంచ మున్సిపాలిటీ రద్దు అయినా ఇక్కడి కార్యాలయాన్ని యథాతథంగా కొనసాగిస్తారు. ఈ కార్యాలయాన్ని డివిజన్ ఆఫీస్‌గా మార్చి ఇక్కడ డిప్యూటీ కమిషనర్‌ను నియమిస్తారు. అలాగే, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, ఏఈ, ఆర్ఐ స్థాయి ఉద్యోగులు విధులు నిర్వర్తించనున్నారు. ఇకపై టౌన్‌ప్లానింగ్, డీఈ, ఆపై అధికారులు కొత్తగూడెం కార్పొరేషన్‌లోనే ఉంటారు. పూర్తి స్థాయి అనుమతులన్నీ అక్కడి నుంచే జారీ అవుతాయి.

మినిట్స్ పుస్తకాలు నిలిపివేత!

కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామపంచాయతీలకు చెందిన కార్యనిర్వాహక, ప్రత్యేక అధికారుల నుంచి సైతం కార్పొరేషన్ అధికారులు చార్జ్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆయా పంచాయతీల మినిట్స్ పుస్తకాల్లో లావాదేవీలు నిలిపివేయాల్సి ఉంటుంది. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పేరుతో బ్యాంక్ ఖాతా తెరుస్తారు. పూర్వ గ్రామపంచాయతీల కార్యనిర్వాహక, ప్రత్యేక అధికారులు ఇందుకు సహకరించాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా కోమటిపల్లి, లక్ష్మీదేవిపల్లి, నిమ్మలగూడెం, మంగపేట, నాయకులగూడెం, సుజాతనగర్, నర్సింహాసాగర్ గ్రామపంచాయతీల అన్ని స్థిర, చరాస్తులను కమిషనర్, కొత్తగూడెం కార్పొరేషన్‌కు బదిలీ చేయనున్నారు. ఈ నిబంధనల ఆధారంగా జూన్ 10వ తేదీ నాటికి సమ్మతి నివేదిక సమర్పించాలని ఇటీవల విడుదలైన జీఓలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పాల్వంచ మున్సిపాలిటీలో కార్యకలాపాలన్నీ వచ్చే 15 రోజుల్లో మారనున్నాయి. జనన, మరణ ధృవీకరణలు, ఇతర అభివృద్ధి పనుల ప్రణాళికలు కార్పొరేషన్ పేరుతో వెలువడనున్నాయి.

అధికారులు అందుబాటులో ఉంటారు..



కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటుతో మరింత అభివృద్ధికి అవకాశం ఉంటుంది. అయితే, పాల్వంచ మున్సిపాలిటీ కార్యాలయం కొనసాగుతుంది. దీన్ని డివిజన్ ఆఫీస్‌గా మార్చి డిప్యూటీ కమిషనర్ నియామకం జరుగుతుంది. ఇతర ఉద్యోగులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఎవరికీ ఇబ్బందులు ఎదురుకాకుండా పర్యవేక్షిస్తాం.

– కె.సుజాత, కార్పొరేషన్ కమిషనర్

ఉపాధి పథకం పేదలకు వరం



గడ్డపార అందజేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: ఉపాధి హామీ పథకం పేదలకు వరం అని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. కొప్పురాయి, రాజారాం తండా గ్రామాలలో ఉపాధి హామీ పనులను శుక్రవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన సామగ్రిని కూలీలకు అందజేశారు. మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకాన్ని గ్రామంలోని ప్రతీఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు తమ పంట చేల వద్ద ఫారంపాండ్లు నిర్మించుకోవాలని సూచించారు. రైతులు దరఖాస్తు చేసుకుంటే ఉపాధి హామీ పథకం ద్వారా ఉచితంగా నిర్మాణం చేపపతారని తెలిపారు. అంతేకాకుండా చేపపిల్లల పెంపకంపై కూడా రైతులు దృష్టి సారించాలని కోరారు. గ్రామాలలోని ప్రతీ ఇంట్లో ఇంకుడు గుంతలు నిర్మించుకొని భూగర్భ జలాల వృద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ముత్తయ్య, ఏపీఓ కాళంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, కార్యదర్శులు సంజీవ్, లక్ష్మణ్, టీఏలు తులసీరాం, భద్రం, పూర్ణచందర్ పాల్గొన్నారు.

వేడుకల్లో భాగస్వామ్యం కండి..



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డైరెక్టర్, అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో 2వ తేదీన జరగనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో సింగరేణి కార్మికులు, స్థానికులు భాగస్వామ్యం కావాలని సింగరేణి డైరెక్టర్ కె.వెంకటేశ్వర్లు కోరారు. కొత్తగూడెంలోని సింగరేణి కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 2న ఉదయం 7–30 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత 9–15 గంటలకు ప్రకాశం స్టేడియంలో సైతం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడమే కాక ఉత్తమ కార్మికులు, అధికారులను సన్మానిస్తామని వెల్లడించారు. ఈ మేరకు వేడుకల పోస్టర్లను డైరెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జీఎంలు కవితానాయుడు, జీవీ కిరణ్‌కుమార్, సీనియర్ పీఓ టి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

చుట్టపు చూపుగా అధికారులు

- ఒత్తిడికి గురవుతున్న అటవీశాఖ చిరుద్యోగులు
- విధులు.. పర్యవేక్షణ వారి బాధ్యతే..
- ఇన్‌చార్జ్‌ల పాలనతో అభద్రత



ఇల్లెందు డివిజన్ అటవీశాఖ కార్యాలయం

ఇల్లెందురూరల్: జిల్లాలోని అతిపెద్ద మండలాల్లో ఇల్లెందు ఒకటి. అటవీ విస్తీర్ణం కూడా అధికంగానే ఉంటుంది. అందుకే ఇల్లెందుకు అటవీశాఖలో డివిజన్ కేంద్రంగా పదోన్నతి కల్పించారు. కానీ తరువాత అనేక అక్రమాలు వెలుగుచూడటంతో అధికారులు సస్పెన్షన్లకు గురయ్యారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించకపోవడం డివిజన్ మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

వరుస సస్పెన్షన్లతో కలకలం...

అవినీతి, విధుల పట్ల నిర్లక్ష్యం వంటి కారణాలతో ఇల్లెందు ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్నను గత సెప్టెంబర్‌లో ఉన్నతాధికారులు సర్వీసు నుంచి తొలగించారు. ఫిబ్రవరిలో రూ.30వేలు లంచం తీసుకుంటూ కొమరారం అటవీశాఖ రేంజ్ అధికారి ఉదయ్‌కిరణ్, మాణిక్యారం బీట్ అధికారి నునావత్ హరిలాల్ ఏసీబీకి పట్టుబడి సస్పెన్షన్‌కు గురయ్యారు. అటవీ అభివృద్ధి నిధులను కాజేశారన్న ఆరోపణలతో ఇల్లెందు రేంజ్ అధికారి రవికిరణ్, డీఆర్‌ఓ సుక్కి, జయరాం సస్పెన్షన్‌కు గురయ్యారు. గుండాల మండలం కాచనపల్లి రేంజ్ పరిధిలోని నారవేప కలప మాయమైన ఘటనలో జగ్గు తండా బీట్ అధికారి హనుమంతు, డీఆర్‌ఓ బేగంలను సస్పెండ్ చేశారు. జేకే ఓసీ నిర్వాసిత ప్రాంతంలో అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో ధృవీకరించి ఇల్లెందు రేంజ్ ధర్మాపురం బీట్ అధికారి చందులాల్‌ను సస్పెండ్ చేశారు. ఇలా ఇల్లెందు డివిజన్ పరిధిలో అనేక మంది ఉన్నతాధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందిపై వెల్లువెత్తిన అవినీతి ఆరోపణలు చివరకు సస్పెన్షన్లకు దారితీశాయి.

కీలక స్థానాల్లో ఇన్‌చార్జ్‌లే దిక్కు...

గడిచిన మూడేళ్లు అధికారుల అవినీతి ఒకవైపు.. పోడు పేరుతో భూముల ఆక్రమణ మరోవైపు అటవీశాఖ ఇల్లెందు డివిజన్‌ను అతలాకుతలం చేస్తోంది. దీనికితోడు సుదీర్ఘకాలంగా డివిజన్ పరిధిలో విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బంది బదిలీ కావడంతో వారి స్థానంలో ఇటీవల కొత్తవారు విధుల్లో చేరారు. దీనికితోడు సెప్టెంబర్ 2024 నుంచి డీఎఫ్ఓ, 2024 మార్చి నుంచి ఇల్లెందు ఎఫ్ఆర్ఓ, 2025 ఫిబ్రవరి నుంచి కొమరారం ఎఫ్ఆర్ఓ పోస్టుల్లో ఇన్‌చార్జ్‌లు కొనసాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్లుగా ఇన్‌చార్జ్‌లను నియమించి చేతులు దులుపుకున్నారు. ఇది డివిజన్ మనుగడపై తీవ్ర ప్రభావం చూపుతోందన్న గుసగుసలు అటవీశాఖ నుంచే వినిపిస్తున్నాయి.

భయం.. భయంగా విధులు

డివిజన్ పరిధిలో క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల్లో అత్యధికులు ఇటీవలే విధుల్లో చేరారు. వీరికి స్థానిక పరిస్థితులపై అవగాహన పెంచుకోవడం టాస్క్‌గా మారింది. ఇటీవల మర్రిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో పోడు వివాదం చోటుచేసుకుంది. స్థానిక రైతులు తమ చేనుకు ఆనుకొని ఉన్న అడవిని కలుపుకున్నారని అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో కనీసం రేంజ్ స్థాయి అధికారి విచారణ కూడా లేకుండా క్షేత్రస్థాయి సిబ్బందిని నిర్మోహమాటంగా సస్పెండ్ చేశారు. ఈ పరిణామం అటవీశాఖలో చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక తమ బీట్ పరిధిలో ఎప్పుడు ఏం జరుగుతోందనన్న భయాందోళనతో బీట్ అధికారులు, సెక్షన్ అధికారులు వణికిపోతున్నారు.

రెగ్యులర్ అధికారులు లేకనే..

ఇల్లెందు డివిజన్‌లో అటవీశాఖ పెద్దమొత్తంలో ఖర్చు చేసి సుభాష్‌నగర్ గ్రామపంచాయతీలో నేచర్ పార్క్‌ను నిర్మించింది. ప్రారంభంలో అధికారుల వైఫల్యం కారణంగా పార్క్ నిర్మాణం అస్తవ్యస్తంగా మారింది. దీన్ని సరిచేసేందుకు ఆ తరువాత వచ్చిన అధికారులు ప్రయత్నించి ఇబ్బంది పడ్డారు. మొత్తంగా పార్క్ నిర్మాణం కోసం వెచ్చించిన నిధులు ఆశించిన ఫలితాలనిచ్చాయా.. లేదా.. అని ఆలోచించకుండా కొత్తగా సమకూర్చిన సదుపాయాలు కూడా సరిగా లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. సైట్ సీయింగ్ కోసం ఏర్పాటు చేసిన టవర్‌కు వెళ్లే మార్గం భారీ వర్షాలకు నడవడానికి కూడా వీలు లేకుండా పోయింది. పార్క్‌లో ప్రజలు నడిచేందుకు ట్రాక్స్, నూతనంగా సమకూర్చిన ఓపెన్ జిమ్ మినహా ఏమీ లేకపోవడం విచారకరం. ఉన్న నిర్మాణాలు, ఏపుగా పెరిగిన మొక్కల నడుమ ప్రజలు సెలవు రోజుల్లో సందర్శించేలా తీర్చిదిద్దే ఆలోచన చేయకపోవడం.. స్థానిక అధికారుల పనితీరును ఎత్తిచూపుతోంది. అంతే కాకుండా వనంలోకి వానరాలను పంపేందుకు గతంలో అటవీశాఖ ఏర్పాటు చేసిన ఫారెస్టు ఫుడ్ కోర్టులు విఫలమయ్యాయి.

ఇలా అనేక సమస్యలు ఇల్లెందు అటవీశాఖ డివిజన్‌ను ఇన్‌చార్జ్‌ల పాలనలో వెంటాడుతున్నాయి. ఇల్లెందు ఎఫ్‌డీఓ, ఎఫ్ఆర్ఓ, కొమరారం ఎఫ్ఆర్ఓ పోస్టులకు ఇన్‌చార్జ్‌లుగా ఉన్న అధికారులు తమ సొంత ప్రాంత విధులపై ఎక్కువ దృష్టి సారించడం ఇల్లెందు డివిజన్ అటవీశాఖ మనుగడపై ప్రభావం చూపుతోందన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇల్లెందు డివిజన్ పరిధిలో కనీసం కీలక పోస్టులకైనా రెగ్యులర్ అధికారులను నియమించాలని పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.